కథా నిలయం
శ్రీకాకుళం

# నిలువుటద్దం

తను వొచ్చి అరగంట కావొస్తోంది.

వసంత ఇంకా రాదేం? చిరాకు పడసాగాడు మూర్తి. నిమిషం గడవటం యుగంగా కనిపిస్తోందతనికి. ఫానుకింద కూర్చున్నా స్వేదబిందువులు అదృశ్యం కావటంలేదు. ముఖం తుడుచుకున్నాడు. అసలే ఎండగా వుంది. దానికితోడు ఊపిరి బిగపట్టుకు కూచున్నాడు. జీవితం అంతకీ సంబంధించిన సమస్య! నిర్ణయం కావాలి. ఏమవుతుందో!

లోపల ఏదో చప్పుడైంది. వసంత వొస్తున్నట్టుంది! మళ్ళీ ఓసారి ముఖం తుడుచుకుని ఎదురుగావున్న నిలువుటద్దంలో చూసుకున్నాడు. క్రాపు సర్దుకున్నాడు. షర్టు కాలరు సరిచేసుకున్నాడు. చిరునవ్వు అభినయించాడు. సోఫాలో చేరగిలబడి కాలుమీదకాలేసుకు కూచుని పోజు

అద్దంలో చూసుకున్నాడు. "బాగానే ఉన్నావులే, ఫరవా లేదు", అని అద్దం అభయహస్తం ఇచ్చింది.

వసంత ఇంకారాలేదు. విసుగుపుట్టింది అతనికి. ఎంత సేపు అలా కూచోటం? లేచాడు. ఏంచేయాలో తోచలేదు. గదినించి బయట మేడమీదకి వచ్చాడు. అంతగా జన సంచారం వుండే వీధి కాదది. ఏమీ తోచలేదు. మళ్ళీ గదిలోకి వొచ్చాడు. పచారు చెయ్యటం ప్రారంభించాడు. కాని చప్పుడుకి వసంత ఏమైనా అనుకుంటుందేమోనని చప్పున ఆగాడు. షెల్ఫులోనించి ఓ పుస్తకం తీసుకుని మళ్ళీ సోఫాలో కూలబడ్డాడు. చదవ బుద్ధిపుట్టలేదు. ఉబుసుపోకకి పేజీలు తిప్పాడు. ఏదో కాగితం కిందపడ్డది, తీశాడు. ఉత్తరంలా వుంది. తనకెందు కనుకుంటూనే అదేమిటో చూశాడు. ముచ్చెమటలు పోశాయి. ప్రేమలేఖ. ఎవరో? ఒకక్షణం అతనికి కళ్ళు తిరిగాయి. భవిష్యత్తు చీకటిగా కనిపించింది. మరికాసేపటికి అతనికి పరిస్థితి కొద్దిగా అవగతమయింది. వసంతని తనుకాక ఇంకెవరో ప్రేమిస్తున్నారనేది రూఢి. తన కావిషయంగురించి పూర్వంవున్న అనుమానం ఇప్పుడు బలపడ్డది. అతని ముఖం ఎర్రబడ్డది. వసంత ఆ ఉత్తరాన్ని చింపి పారేయకుండా అలా పుస్తకంలో దాచి వుంచటం అతనికి గుండెల్లో శైల్లు పరుగెత్తించింది. అంటే ఆమె ఆప్రేమికుడు ఎవరినో నిర్లక్ష్యం చెయ్యటంలేదని స్పష్టం. మూర్తికి ముఖం జేవురించింది. కొంపతీసి వాడే ఆమె ప్రేమకి పాత్రుడు కాడుకదా! అతని ముఖంలో ఈర్ష్య తాండవించింది. దైన్యం మూర్తీభవించింది. నిస్పృహా

ఆవరించింది. సర్వస్వం పోగొట్టుకున్నవాడిలాగా సోఫాకి చేరగిలబడ్డాడు.

ఎదురుగా వున్న నిలువుటద్దంలోకి శూన్యంగా చూశాడు. తటాలున అతడు ముందుకు వంగాడు.

"ఎందుకీ వెధవ ఏడుపు?"

ఈ మాటలు ఎవరూ అనలేదు. కాని ఎవరో అన్నట్టుగా అతనికి అనుభూతి కలిగింది. తనమీద తనకే ఏవగింపు కలిగింది. 'ఛీ', అనుకున్నాడు. ఒకక్షణంలో అతనిలో అంతకిపూర్వం కలిగిన భావసంచలనం అదృశ్యమైంది.

ఆ ఉత్తరాన్ని మామూలు తెల్లకాగితంగా చూశాడు. మళ్ళీ దానిని పుస్తకంలో పెట్టేశాడు. ఒకవేళ వసంత ఆ ఉత్తరం రాసిన అతన్నే ప్రేమించేట్టయితే తను చేసేదేమీ లేదు. అదృష్టం అతన్ని వరించిందన్నమాట. ఈర్ష్యపడటం తెలివితక్కువ. కాని అలా జరక్కుండా తనేమైనా చెయ్యగలడా? అంటే అతనికంటే తన ఆధిక్యత రుజువుచేసుకోగలడా? మూర్తి ఆలోచించాడు. వసంతకి చెప్పాలి. ఎంతో నైపుణ్యంతో అనుభూతి అందిస్తున్నట్టుగా చెప్పాలి. నిజాయితీ పుట్టిపడేలా చెప్పాలి. తను ఆమెని హృదయ నైర్మల్యంతో ప్రేమిస్తున్నాడు. హృదయాధిదేవతగా ఆరాధిస్తున్నాడు. "ఇది నిజం", అని ఆమె నమ్మాలి. నమ్మి తీరాలి. అలా తను చెప్పగలగాలి. ఆమె లేకపోతే తన జీవితం అంధకారసదృశం అని ఆమె తెలుసుకోగలగాలి. ఎలా! మాటలతో ఏమీ లాభంలేదు. ముఖంలో ఈ

భావాలు ప్రస్ఫుటంకావాలి. దైన్యం, అసహాయత, ప్రేమ, ఆశ, నిరాశ ఇవన్నీ తాండవించాలి.

మూర్తి ముఖం అద్దంలో చూసుకున్నాడు. మళ్లీ, మళ్లీ చూసుకున్నాడు. మూర్తీభవించిన దీనత్వంలా ఉంటే గాని ఆమె కరుణించదు. అలా...మధ్య యుగంలోని ఇంగ్లీషు హీరోలు మోకాళ్ళమీద నుంచుని ప్రాధేయపడటం అత నికి జ్ఞాపకం వొచ్చింది. ఇంచుమించు అలా—అంతే...

"ఏమిటా వెధవ మొహం ?

మూర్తికి వీపుమీద కొరడాతో కొట్టినట్టయింది. తటాలున ముఖభంగిమలు అదృశ్యమయాయి. సోఫాలో మామూలుగా కూర్చున్నాడు.

తలుపు చప్పుడైంది. అతృతగా అటువైపు చూశాడు. కర్టన్ తొలగింది."

"చాలాసేపైనట్టుంది, వచ్చి ?"

అంత ఎక్కువసేపు కాలేదని మాట వరసగా అనాలని అస్పష్టంగా గొణిగాడు మూర్తి. కనీసం ఇప్పటికైనా దర్శనం కలిగింది ! ఒకక్షణం అటూ ఇటూ చూసి ఆమె ముఖంలోకి చూశాడతను. కొంపమునిగింది! ఆమె తన చేతిలో పుస్తకంవైపు చూస్తోంది. ఎంత మతిమాలిన పని చేశాడు! అతడు తనవైపు చూడటంతో వసంత దృష్టి మళ్ళించింది. ఆమెకు కోపం తెప్పించానని అతడు మధనపడటం ప్రారంభించాడు. ఇవాళ అన్నీ తెలివితక్కువపనులే చేస్తున్నాడు.

వసంత తాపీగా కుర్చీలో కూర్చుని అంది. "పుస్తకం తిరగేస్తూ కూర్చున్నట్టున్నారు!"

అసలు పుస్తకం పేజీలు తిప్పలేదని అందామను కున్నాడు. కాని అనలేకపోయాడు. అంటేమట్టుకు ఆమె నమ్మొద్దూ? పైగా అబద్ధాలకోరనే వాదు కొనితెచ్చు కోటం అవుతుంది. "ఊఁ," నసిగాడు.

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి. వసంత ఏదో పత్రిక పేజీలు తిప్పుతోంది. ఆమె వైఖరిచూస్తే ఇహ ఆశపెట్టుకోటం అనవసరం అనుకోవొచ్చలేనే వుంది! తనంటే ఏమాత్రం లక్ష్యం వున్నట్టు ప్రవర్తించటంలేదు. అయినా చివరిదాకా ప్రయత్నం చెయ్యకతప్పదు.

"నేను వొచ్చినపని మీకు తెలుసనుకుంటాను."

"చెప్పందే ఎలా తెలుస్తుంది?"

"ఊహించివుంటా రనుకుంటాను."

"ఏదో ముఖ్యవిషయం మాట్లాడా లన్నారు."

మూర్తి ఉపోద్ఘాతం విరమించాడు. సూటిగా చెప్పాడు రెండుముక్కల్లో. తమ పరిచయంవల్ల తనకి ఆమె మీద ప్రేమ కలిగిందనీ, ఆమె ఒప్పుకుంటుందని ఆశిస్తు న్నాననీ.

వసంత ఏమీ మాట్లాడలేదు. ఆమె ముఖంలో మటుకు అతనికి కొంచెం ఆశ్చర్యం కనిపించింది. అదే అతనికి అర్థం కాలేదు. ఈ పరిస్థితి వొస్తుందని ఆమె ఊహించలేదను కోటం కల్ల. అతనామెవైపు ఆదుర్దాగా చూశాడు. వసంత

మూర్తివైపు ఓసారిచూసి తరవాత అతనిచేతిలో పుస్తకం వైపు చూసింది. ఎంతసేపటికీ ఆమె మాట్లాడలేదు. ఆ పుస్తకం అలా చూడటంతో మూర్తికి ఒళ్లుమండింది. అతన్ని అపహాస్యం చేస్తూన్నట్టుగా ఫీలయ్యాడు. ఏమిటి ఆమె అభిప్రాయం?

"మీ అభిప్రాయం నిర్మొహమాటంగా చెప్పొచ్చు."

అయినా ఆమె మాట్లాడలేదు. దిక్కులు చూడటం మళ్ళీ ఆ పుస్తకంవైపు చూడటం—మూర్తి ఉండబట్టలేక పోయాడు. కసిగా అన్నాడు:

"ఈ పుస్తకంలో ఉత్తరం నేను చూశాను. క్షమించాలి, యథాలాపంగా చూశాను. రహస్యం అనుకోలేదు."

వసంత ఒక్కక్షణం ఆగి అంది.

"అయితే, సరే."

ఏమిటామె వుద్దేశం? మూర్తి యిహ ప్రశ్నలేమీ అడగదలుచుకోలేదు. అతనిలో సహనం చచ్చిపోయింది. ఆమె ప్రవర్తన నిర్లక్ష్యభావం చూసి అతనికి అరికాలిమంట నెత్తికెక్కింది. పుస్తకం ఆమె ముఖంమీద విసిరికొట్టాలని బలీయంగా అనిపించింది. కాని తమాయించుకున్నాడు. వెంటనే అక్కడినించి వెళ్ళిపోటం శ్రేయస్కరం అనుకుని లేచాడు.

"వెడుతున్నారా?"

"ఊఁ"

"ఉండండి. కొంచెం షర్బత్ తీసుకుని వెడుదురుగాని."

ఆమె ఆమాటలు మామూలుగానే అంది. కాని మూర్తికి వెటకారంగా వినిపించాయి. వసంతలో యింత నైచ్యం, ఇంత దురహంకారం ఉన్నాయని తనెప్పుడూ అనుకోలేదు. తనని కీలుబొమ్మని ఆడించినట్టు ఆడిస్తోంది. మోసపోయాడు. అహంభావంతో యిన్నాళ్ళూ తనచుట్టూ తిప్పించుకుంది. తను మహా అందగత్తె అని గర్వం. అందం వుంటే వుండొచ్చు. కాని అంత మిడిసిపాటు దేనికి? అందంతో తనలాంటివాళ్ళని ఉసిగొలిపి చివరికి ఎందుకూ పనికిరాని వాళ్ళనిగా, భగ్నహృదయులుగా చేస్తే ఆమెకి ఒరిగేదేమిటి? తనలాంటివాళ్లు తలుచుకుంటే... మూర్తి తనని తను మర్చిపోయాడు. ఉక్రోషంతో సర్వం మర్చిపోయాడు. వసంత పర్బత్తు కలపటంలో నిమగ్నురాలయింది. ఆమెవైపు మత్తెక్కిన కళ్ళతో చూశాడు. నఖశిఖపర్యంతం చూశాడు. ఒక అడుగు ముందుకు వేశాడు...సమీపిస్తున్నాడు...ఒక్కసారి చుట్టూ చూశాడు. అరె! ఎవరిదా ముఖం? భీకరంగా, పైశాచికంగా, నెత్తురులా ఎర్రగా... మూర్తి అదిరి పడ్డాడు. ఆ ముఖం. ఒకక్షణం గుండె ఆగిపోయినట్టనిపించిం దతనికి. ఆ పైశాచిక వదనం! ...కాదు,కాదు... మనిషే! అమ్మయ్య. మూర్తికి మనసు మనసులో లేదు. తటాలున అతనికి పరిస్థితి అర్థమైంది. గిరిక్కున వెనక్కి తిరిగాడు.

వసంత పర్బత్ కలిపి వెనక్కి తిరిగి చూసింది. మూర్తి లేడు. ఎదురుగా నిలువుటద్దంలో కనిపించింది—మూర్తి గబగబా వెళ్ళిపోతున్నాడు.

"మూర్తిగారూ",

అతడు వినిపించుకునే స్థితిలోలేడు. భుజంమీద చెయ్యి పడ్డది. వసంత! అతని ముఖం వివర్ణమౌతోంది.

"అంతకోపమైతే ఎలా?

అతడు సమాధానంచెప్పే స్థితిలోలేడు.

"రండి",

వెనక్కి తిరిగితే—!

రుమాలు అడ్డం పెట్టుకుని అప్రయత్నంగా నడిచాడు మళ్ళీ గదిలోకి. ఎదురుగా నిలువుటద్దంలో—పాలిపోయిన ముఖం. పక్కన సహజసుందర వదనారవిందం.

"లైఫ్‌సైజ్ ఫోటోలా వుందికదూ !"

ఒకక్షణం అతనికి వసంతమాటలు అర్థంకాలేదు. తరవాత ఆమెవైపు అనుమానంగా చూశాడు. ఆమె చిరునవ్వు నవ్వింది.

"ఆ వుత్తరం శుద్ధకల్పితం. మిమ్మల్ని పరీక్షించటానికి నేనేరాశాను. నేనురావటం ఆలస్యంచేస్తే మీ రా పుస్తకం తీస్తారని నాకు తెలుసు. ఎంత నిబ్బరమండీ మీకు! పల్లెత్తుమాట అనలేదు. ఈర్ష్యపడలేదు. నిందమోపలేదు. ప్రాధేయపడలేదు. కాని ఎంత నిరాశపడ్డారో మీ ముఖం చూస్తేనే తెలుస్తోంది. మీ వ్యక్తిత్వాన్నిలా పరీక్షించినందుకు క్షమించరూ ?

ఏమిటేమిటో అంటోంది, వసంత. అద్దంలో ఇద్దరిని చూసి మందంగా నవ్వాడు మూర్తి. కాని అతనికా అద్దమే ముసిముసిగా నవ్వినట్టనిపించింది.